9490300350

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

**ప్రకాశంజిల్లా కమిటి.**

**కార్పోరేట్ల ప్రయోజనాలు కోసమే చంద్రబాబు పనిచేస్తున్నారు.**

**ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాలను నిరశిస్తూ ప్రజలు విశాల ఉద్యమం చేపట్టాలి.**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై వెంకటేశ్వరరావు**

కార్పోరేట్ల అనుకూల విధానాలను అనుసరిస్తున్న టిడిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయా తరగతుల ప్రజలు విశాల ఉద్యమం చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటి సమావేశం మంగళవారం సుందరయ్య భవన్‌లో జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాలా అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వై వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో కార్పోరేట్ల అనుకూల విధానాలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం గతం కంటే మరింతగా కార్పోరేట్ల ప్రయోజనాలు కోసం పనిచేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధి పేరు చెప్పి బహుళజాతి కంపెనీలతో, పెద్దపెద్ద పారిశ్రామిక వేత్తలకు పేదరైతులు, దళితులు ఎన్నో దశాబ్ధాలుగా అనుభవిస్తున్న భూములను చంద్రబాబు ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా శాసనసభలో కార్మికచట్టాలలో మార్పులు చేసిందని దుయ్యబట్టారు. ప్రపంచబ్యాంక్ రెండో ర్యాంక్ ఇచ్చిందని సింగ్‌పూర్‌లో చెప్పకుంటున్న చంద్రబాబు రాష్ట్రంలో ఎటువంటి కార్మిక ఆందోళనలు, ఉద్యమాలు
ఉండవని సింగ్‌పూర్‌లో చెప్పడం ఆయన నైజంను బయటపెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాల్సింది పోయి ప్రయివేట్ విశ్వవిద్యాలయాలను శరవేగంగా తీసుకరావడానికి ప్రభుత్వం చూడటం ప్రభుత్వ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతుందన్నారు. వైద్యరంగాన్ని కూడా కార్పోరేట్ల చేతుల్లో కట్టపెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయకుండా కార్పోరేట్ల చేతుల్లో పెట్టడానికి ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజలు నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న పొగాకు సంక్షోభం నివారణకు, పొగాకు రైతులను ఆదుకునే విషయలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూతూమంత్రం ప్రకటనలు తప్ప నిర్ధిష్ట చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. జిల్లాలో పొగాకు సంక్షోభం తీవ్రంగా ఉందన్నారు. పొగాకుకు గిట్టుబాటు ధర రాకపోవడంతో బ్యారెన్‌కు మూడు లక్షల వరకు రైతు నష్టపోయారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల రైతాంగం మూల్యం చెల్లిస్తున్నారన్నారు. ఈ పాటికే జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. సంక్షోభాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కొనుగోలు కంపెనీలపై నెట్టడం తప్ప పొగాకు కొనుగోలుకు బోర్డు ద్వారా తగిన ధర ఇప్పించడానికి నిర్ధిష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. చంద్రన్నయాత్ర పేరుతో ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేయడం తప్ప రైతాంగం అప్పుల్లో నుండి, నష్టాల ఊబిలో నుండి బయటికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. . రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కిలో 20లు రైతులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. బ్యారెన్‌కు లక్ష రూపాయిలు నష్టపరిహారం, రుణాలకు వడ్డీమాఫీ, రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో తగినంత వర్షపాతం లేక కరువు పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. ప్రభుత్వం మాత్రం కరువు నివారణకు ఎలాంటి సహాయ చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. ఉపాధిపనులు చూపించడంలో ప్రభుత్వం ఉదాసీనత చూపిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కరువు మండలాల్లో ఉపాధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులో వైద్యం మెరుగుదల లేదన్నారు. డాక్టర్లు, నర్సులు, మందుల కొరత ఆసుపత్రులలో ఉందన్నారు. ఆసుపత్రులలో సమస్యలు పరిష్కారం చేయకపోగా హాస్పటల్ కమిటీలు వేయడం, అందులో టిడిపి వారిని ఉంచడం అన్యాయమన్నారు. హాస్పటల్ పై ప్రభుత్వ పర్యవేక్షణ చక్కదిద్దాలన్నారు. అర్హులైన వారికి వృద్దాప్య పించన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలనిడిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు జివి కొండారెడ్డి ఎస్‌డి హనీఫ్, ఎస్‌కె మాబు, పెంట్యాల హనుమంతరావు, చీకటి శ్రీనివాసరావు, జిల్లా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఇట్లు

పూనాటి ఆంజనేయులు

జిల్లా కార్యదర్శి